సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 16 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.33 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



నువ్ గ్రేట్ 'నాన్నా'!
బిడ్డలను లాలించి... లాలపోసి.. అడుగు లేయించి.. అక్షరాలు పలికించి అన్నీ తానై తోడూనీడగా ఉండే తండ్రి.. అనురాగానికి, ఆప్యాయతలకు ప్రతీక.

8లో

గరిష్టం/కనిష్టం
35.4°/22.6°

జిల్లా పరిధిలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

18న కేవీకేలో రైతు సదస్సు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18న రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. 'పీఎం కిసాన్ సమాన్ నిధి' నిధుల విడుదల సందర్భంగా వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే కార్యక్రమాన్ని రైతులకు వీక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22న హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాంకు ఎంపిక



అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ,హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్తంగా హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఈ నెల 22న అనంతపురం ప్రభుత్వ ఐటీఐ (బాయ్స్) కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. 2023–2024కు 70 శాతం ఉత్తీర్ణత, మ్యాథ్స్ లేదా బిజినెస్ మ్యాథ్స్‌లో 60 కంటే ఎక్కువ శాతంతో ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. నాన్ ఐటీ రంగంలో 2023–2024లో 70 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో ఇంటనర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ టెక్‌బీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ 2023–2024లో పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపస్ డ్రైవ్‌కు రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, (పదో తరగతి, ఇంటర్మీడియట్), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 6363095030, 8555085030 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయం



అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–23 సౌత్ జోన్ టోర్నీలో భాగంగా నిర్వహిస్తున్న మ్యాచ్‌ల్లో శనివారం నెల్లూరు, చిత్తూరు జిల్లాల జట్లు విజయం సాధించాయి.

- నెల్లూరుతో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి కర్నూలు బ్యాటింగ్ ఎంచుకుంది. 27.3 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 23.5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 125 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది.
- చిత్తూరుతో జరిగిన మ్యాచ్‌లో కడప టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 220 పరుగులు సాధించింది. ఎం.వాసుదేవరాజు 89 బంతుల్లో 50 పరుగులు (3 ఫోర్లు, 1 సిక్స్), విజయరామిరెడ్డి 75 బంతుల్లో (5 ఫోర్లు, 3 సిక్స్‌లు)66 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 40.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసి గెలుపొందింది. ధరణి కుమార్ 68 బంతుల్లో 57 పరుగులు (నాలుగు ఫోర్లు), రెడ్డి రుషిల్ 86 బంతుల్లో 104 పరుగులు (9ఫోర్లు, 6 సిక్స్‌లు) ధాటిగా ఆడి జట్టు విజయానికి కృషి చేశారు.

వజ్రమా.. వరించుమా!

రాయలు కాలంలో వజ్రాలు రాసులు పోసి అమ్మేవారని చెబుతుంటారు. రత్న గర్భంగా పేరొందిన రాయలసీమ భూముల్లో వజ్రాలు లభిస్తాయనేది ప్రజల నమ్మకం. ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చినప్పుడు భూమి పొరల్లోంచి వజ్రాలు బయటపడతాయని, చాలా మందికి దొరికాయని విస్తృతంగా ప్రచారం సాగింది. ఇంకేముంది ఔత్సాహిక జనం వజ్రాల కోసం ధర్మవరం మండలం చిగిచెర్ల పంట పొలాలకు క్యూ కడుతున్నారు.



చిగిచెర్ల గ్రామ సరిహద్దు పొలాల్లో వజ్రాల కోసం వెతుకులాట

- వజ్రాల కోసం అన్వేషణ మరూ..
- వర్షాకాలమొస్తే చాలు అందరూ చిగిచెర్లకే
- భూమిపొరల్లోంచి వజ్రాలు బయటపడతాయని నమ్మకం

ధర్మవరం : వర్షాకాలం వచ్చిందంటే చాలు ధర్మవరం – చిగిచెర్ల ప్రధాన రహదారి సమీపంలో జనం గుంపులు గుంపులుగా కనిపిస్తుంటారు. అందుకు కారణం ఆ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతాయనే ప్రచారం ఊపందుకోవడమే. దీని గురించి సమాచారం తెలిసిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు, తొందరగా లక్షాధికారులు అయిపోదామని భావించే వారు వజ్రాన్వేషణకు వచ్చేస్తున్నారు. చిగిచెర్ల వద్ద కందుకూరు కెనాల్‌కు ఆనుకుని ఉన్న పంట పొలాలకు చిన్న, పెద్ద తేడా లేకుండా వెళ్తుంటారు. సూక్ష్మ రేణువులను సైతం వదలకుండా భూతద్దం ఇతర పరికరాల ద్వారా నిశితంగా పరిశీలిస్తుంటారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు గుత్తి, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి కూడా ప్రజల వీటి కోసం అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. చాలా ఏళ్ల కిందట ఇక్కడ పంట పొలాల్లో వజ్రాల కోసం పలు పరిశోధనలు జరిగాయి. అయితే వజ్రాలు ఉన్నట్లుగా చూపే ఆధారాలేవీ బహిర్గతం కాలేదు.

ఉత్సాహంగా అన్వేషణ

పంట పొలాల్లోకి చేరిన జనాలు మట్టిని పెకలిస్తూ కనిపించిన ప్రతి రాయినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. కాంతివంతమైన రాయి కనిపిస్తే చాలు అది వజ్రమేనేమోనన్న ఆనందంలో కేరింతలు కొడుతున్నారు. వారికి వారే అది వజ్రం కాదు.. సాధారణ రాయేనని చర్చించుకోవడం.. తిరిగి ఆశతో అన్వేషణ కొనసాగించడం పరిపాటిగా మారుతోంది. విభిన్నంగా ఉన్న రాళ్లు వజ్రమా లేక రంగు రాయా అన్నది పరీక్షల్లోనే తేలనుంది. ఇప్పటి వరకు వజ్రం ఫలానా వారికి దొరికింది అన్న వివరాలేమీ లేవు. అయినా సరే జనం ఆశతో ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఎప్పుడో ఒకప్పుడు వజ్రం లభించకపోతుందా అని అలుపెరగకుండా అన్వేషిస్తూనే ఉన్నారు.




వజ్రాలను పోలిన రంగురాళ్లు



ధర్మవరం - చిగిచెర్ల ప్రధాన రహదారి వద్ద వజ్రాన్వేషకులు

అలవాటైపోయింది

చిగిచెర్ల పొలాల్లో వజ్రాలు దొరుకుతాయన్న ప్రచారం నా చెవినపడినప్పటి నుంచి నేను ఇక్కడకు వచ్చి వెదుకుతున్నాను. వర్షాకాలంలో చాలాసార్లు వెదికినా ఇప్పటి వరకు అదృష్టం వరించలేదు. అయినప్పటికీ ప్రయత్నం విరమించలేదు. నేనొక్కడినే కాదు ఇక్కడికి ఇతర జిల్లాల వారు కూడా వాహనాల్లో వచ్చి వెతుకుతుండటం ఆశ్చర్యం కల్గిస్తోంది.

– సర్దార్, ధర్మవరం

పొలాలు నాశనం చేయొద్దు

మా పొలాల్లో వజ్రాలు దొరుకుతున్నాయని విస్తృత ప్రచారం జరిగింది. ఎక్కడెక్కడి నుంచో జనం తండోపతండాలుగా వస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ తొక్కుతూ పంట పొలాలను నాశనం చేస్తున్నారు. దీంతో మేమంతా పనులు మానేసి కాపలా ఉండే పరిస్థితి నెలకొంది. దయచేసి ఎవ్వరూ మా పంటపొలాల్లోకి రావొద్దు.

– చంద్రప్ప, రైతు, చిగిచెర్ల

టీబీ డ్యాంలో 6 టీఎంసీల నీరు



టీబీ డ్యాంకు జలకళ సంతరించుకున్న దృశ్యం

బొమ్మనహాళ్: జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ (ఎగువ) కాలువ ద్వారా తాగు, సాగు నీరందించే కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం జలాశయంలో 6.024 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మే నెలాఖారు వరకు డ్యాంకు ఇన్‌ఫ్లో లేదు. కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది. అయితే కొన్ని రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 1,676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. అవుట్‌ఫ్లో 301 క్యూసెక్కులుగా నమోదవుతోంది. ప్రస్తుతం జలాశయంలో 1,582.89 అడుగులకు నీరు చేరుకుంది. మొత్తం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.024 టీఎంసీల నీరు ఉంది. వర్షాలు కొనసాగుతుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1,581 అడుగుల వద్ద 4.975 టీఎంసీల నీరు నిల్వ ఉండిందని వెల్లడించారు.

అందరి సహకారంతోనే ఎన్నికలు విజయవంతం

- సిబ్బందికి అభినందనలు తెలిపిన ఎస్పీ మాధవరెడ్డి



పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీసు సిబ్బంది అందరి సహకారంతో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి.. 60 మంది పోలీసులకు ప్రశంసాపత్రాలు, రివార్డులను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో పోలీస్ సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. పోలీస్ సిబ్బంది సమష్టిగా విధులు నిర్వర్తించడంతో నామినేషన్ ప్రక్రియ నుంచి కౌంటింగ్ వరకు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. చెక్‌పోస్టుల్లో సిబ్బంది 24 గంటలూ విధులు నిర్వహించారని, సెబ్ అధికారులు పూర్తిగా నిఘా పెట్టడం వలన కర్ణాటక లిక్కర్, నగదు వంటి వాటికి అడ్డుకట్ట వేయగలిగామన్నారు. ఎలక్షన్ సెల్ ఎస్పీ శాఖ అప్రమత్తంగా పనిచేస్తూ ప్రతి సమాచారం ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు అందించామన్నారు. ముందస్తుగా భద్రతా చర్యలు తీసుకోవడంతో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా చూడగలిగామన్నారు. ఎన్నికల సమయంలో సమర్థవంతగా విధులు నిర్వహించడంతో రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరు వచ్చిందన్నారు. ఎన్నికల విజయవంతంలో మీ కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణ, ఈఎస్ సుబ్రమణ్యం, సీఐలు బాలసుబ్రమణ్యం రెడ్డి, విక్రమ్, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం



భక్తులతో కిటకిటలాడుతున్న కసాపురం ఆలయ ముఖమండపం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. శనివారం వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అర్చకులు అనంతరం స్వర్ణ వజ్రకవచ అలంకరణలో స్వామి వారిని తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేపట్టిన ఆలయ సిబ్బంది వారికి అన్నదానం చేపట్టారు.

రాకెట్లలో సినిమా షూటింగ్ సందడి




సినిమా షూటింగ్‌లో పాల్గొన్న హీరో ఆదిపినిశెట్టి, రైతు ఇంట్లో సినిమా షూటింగ్ జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ: రాకెట్ల గ్రామంలో హిట్ మ్యాన్ అండ్ ప్రోమోస్ ప్రొడక్షన్ సినిమా యూనిట్ శనివారం సందడి చేసింది. గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన ఎంపిక చేసిన రైతు ఇంట్లో షూటింగ్ ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో ఇంద్రప్రస్థా పేరుతో నిర్మిస్తున్న సినిమాలో ప్రముఖ నటుడు ఆదిపినిశెట్టి, చైతన్యకృష్ణ హీరోలుగా నటిస్తున్నారు. 1970, 1980లో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈనెల 20 వరకూ ఆమిద్యాల, తగ్గుపర్తి, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో షూటింగ్ జరుపుకోనుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

ఉచిత విద్య మిథ్యే

- అమలు కాని విద్యాహక్కు చట్టం
- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పేదలకందని ఉచిత విద్య
- దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలూ బేఖాతరు



జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు	650
ఏటా ఒకటో తరగతిలో సగటు అడ్మిషన్లు	20 వేలు
25 శాతం కోటా కింద చేయాల్సిన అడ్మిషన్లు	5వేలు

కదిరి: జిల్లాలో విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు చట్టం నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. పకడ్బందీగా అమలయ్యేలా చూడాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండం విమర్శలకు తావిస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం కోటా సీట్లు ఉచితంగా ఇవ్వాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. అమలు చేసి తీరాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ అధికారులు మాత్రం అమలు చేస్తామని చెప్పడమే కానీ చర్యలు తీసుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం 2010 నుంచి అమలులోకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 650 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సరాసరిన ప్రతి పాఠశాలలో 30 మంది విద్యార్థులు చొప్పున ఒకటో తరగతిలో చేరుతున్నారు. అంటే సుమారు 20 వేల మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశిస్తున్నారు. అందులో 25 శాతం కోటా ప్రకారం 5 వేల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో ఉచితంగా ప్రవేశం ఇవ్వాలి. కానీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా పేద పిల్లలకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చిన దాఖలాలు లేవు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 13న పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. చాలా వరకు అన్ని కార్పొరేట్ పాఠశాలల్లో వేసవి సెలవుల్లోనే అడ్మిషన్లు పూర్తి చేశారు. కాకపోతే విద్యాహక్కు చట్టం ప్రకారం పేద పిల్లలకు రావాల్సిన 25 శాతం కోటా సీట్లు ఎక్కడా అమలు చేయలేదు.

25 శాతం కోటాలోనూ రిజర్వేషన్లు..

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత కోటా సీట్లకు సంబంధించి రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిబంధన కూడా ఉంది. ఈ విషయం విద్యాహక్కు చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఆర్థికంగా వెనుకబడిన ఓసీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 6 శాతం, అనాథలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం సీట్లు ఇవ్వాలి. ఈ కోటాలో తమ పిల్లలకు ఉచితంగా సీటు సాధించాలంటే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.60 వేలకు మించరాదు. బియ్యం కార్డు ఉన్న వారు అర్హులు. 25 శాతం సీట్ల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షిని వివరణ కోరితే విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం కోటా పేద పిల్లలకు తప్పకుండా అమలయ్యేలా చూస్తామని చెప్పారు. అలా అమలు చేయని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భజగోవిందం.. సాయి సందేశం




భజగోవిందం నాటికలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: మధ్యప్రదేశ్‌కు చెందిన వందలాది మంది సత్యసాయి భక్తులు రెండు రోజుల పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. శనివారం ఉదయం సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక శ్రీసత్యసాయి అష్టోత్తర సహస్ర నామావళి పఠించారు. సాయంత్రం మధ్యప్రదేశ్‌కు చెందిన బాలవికాస్ చిన్నారులు 'భజగోవిందం' పేరుతో నాటిక ప్రదర్శించారు. సత్యసాయి తన చిట్టి కథలలో బోధించిన నీతిని వివరిస్తూ చిన్నారుల నాటిక కొనసాగింది.



సత్యసాయి వేషధారణలో చిన్నారి



సామూహిక అష్టోత్తర సహస్ర నామావళిని పఠిస్తున్న మధ్యప్రదేశ్ భక్తులు

క్లుప్తంగా

భక్తులతో ఖాద్రీ ఆలయం కిటకిట



శ్రీవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతోపాటు అన్నదానం నిర్వహించారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

'నేను బడికి పోతా'పై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఈఓ మీనాక్షి

కొత్తచెరువు: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడికిపోదాం తలరాతను మార్చుకుందాం, పోదాం పోదాం సర్కారు బడికిపోదాం, అమ్మ నేను బడికి పోతా, నాన్న నేను బడికి పోతా అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈసందర్భంగా డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ నెల రోజులు పాటు స్పెషల్ డ్రైవ్ ద్వారా బడి బయట పిల్లలను 100 శాతం బడుల్లో చేర్పించేలా ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. ఎంఈఓ జయచంద్ర, హెచ్ఎం వాణిబాయి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక మాజీ సర్పంచ్ మృతి

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిన్నకొండయ్య(68) వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. చిన్న కొండయ్య వైఎస్సార్‌సీపీ వీరాభిమాని. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందటంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో అస్వస్థతకు గురైన ఆయన శనివారం మృతి చెందాడు.

సందర్భం: నేడు ఫాదర్స్ డే

నువ్ గ్రేట్ నాన్నా!



- అప్యాయతల కలబోత
- మార్చేను తలరాత
- తను కరుగుతూ వెలుగునిచ్చే వ్యక్తి

''నాన్నా నువు నా ప్రాణం అనినా.. సరిపోదట ఆ మాట'' ఇటీవల విడుదలైన ఓ సినిమాలోని పాటలో చరణాలివి. కొవ్వొత్తిలా తాను కరుగుతూ ఇంటికి వెలుగునిచ్చే నాన్న గురించి చెప్పడానికి ఇంతకంటే మించిన మాటలు నిజంగా లేవేమో! బిడ్డలను లాలించి... లాలపోసి.. అడుగులేయించి.. అక్షరాలు పలికించి అన్నీ తానై తోడూ నీడగా ఉండే తండ్రి అనురాగానికి ఆప్యాయతలకు ప్రతీక. నాన్నతో గడిపిన క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరచిపోలేని మధురానుభవాలు. అలా బిడ్డల జీవితాన్ని చేయి పట్టుకు నడిపించి ప్రయోజకులుగా తీర్చి దిద్దే తండ్రి ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ గౌరవించడానికి ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. ప్రతి ఏటా జూన్ మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్ డేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– అనంతపురం/అనంతపురం కల్చరల్

తరాలు మారినా ఆయనే కీలకం..

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నడిచే రోజుల్లో తండ్రి అంటే అత్యంత భయభక్తులుండేవి. ఎదిరించి మాట్లాడడం కాదు కదా.. కావాల్సింది అడగడానికి కూడా జంకి తల్లి ద్వారా తమ కోర్కెలు తీర్చుకునేవారు. అయితే కాల చక్రంలో అనేక మార్పులొచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు చెదిరిపోయాయి. బాధ్యతలు పెరిగాయి. కాలానుగుణంగా నాన్న పాత్ర కూడా మారిపోయింది. చిన్న కుటుంబాల్లో స్నేహితుడిగా మారిపోయాడు. పిల్లలను నిత్యం పాఠశాలకైనా, కళాశాలకైనా దిగబెట్టడానికి వెళ్తాడు. మళ్లీ సాయంత్రం తీసుకువస్తాడు. ఒకవైపు కుటుంబ పోషణకు రోజంతా కష్టపడుతూనే.. పిల్లలకు మార్గదర్శిగా ఉంటూ బిడ్డలకు అన్నీ తానై నడిపిస్తున్నాడు. పెళ్లై అత్తారింటికి వెళ్లినా, ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడో స్థిరపడే మగపిల్లలను తండ్రి పంచిన క్రమశిక్షణే ముందుకు సాగేలా చేస్తుందనడంలో సందేహం లేదు. నాన్నంటే వెన్నంటి వచ్చే ఓ నీడ.. సర్వస్వం త్యాగం చేసే బాధ్యతకు ప్రతిరూపం అన్న భావాన్ని ఈ తరం పిల్లలు వ్యక్తం చేస్తున్నారు.

“

నాన్న లేకపోతే నేను లేను



మాది నెల్లూరు జిల్లా ఇందుకూరు పేట. నాన్న ఏ. నాగబ్రహ్మేంద్రరావు ప్రోత్సాహం లేనిదే నేను లేను. మేము 8 మంది సంతానం. ముగ్గురు అబ్బాయిలు. ఐదుగురు అమ్మాయిలం. వ్యవసాయాధారిత కుటుంబం. అందరినీ సమానంగా చూశారు. ఉన్నత చదువులకు మా అమ్మ సమ్మతించకున్నా, నాన్న వెళ్లమని ప్రోత్సహించారు. నాన్నకు చదువు అంటే చాలా ఇష్టం. మా కోసం చాలా త్యాగం చేశారు. అబ్బాయిలతో పాటు సమానంగా అమ్మాయిలను పెంచారు. ఆయన లేకుంటే నేను ఇంత వరకూ వచ్చేదాన్నే కాను. – ప్రొఫెసర్ కే. కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, ఎస్కేయూ క్యాంపస్ కళాశాల

నాన్న ఆశయం నెరవేర్చా



మా నాన్న శంకర్ నగరంలో ఓ హోటల్ నడుపుతున్నారు. నన్ను పెద్ద క్లాసికల్ డ్యాన్సర్‌ను చేయాలనేది ఆయన కల. నా చిన్నప్పటి నుంచి అదే చెప్పేవారు. నాకు మా నాన్నంటే ఎంతో ఇష్టం. ఆయన కోసం అదే ఇష్టాన్ని శాస్త్రీయ నృత్యంపై పెట్టి మెలకువలు నేర్చుకున్నా. ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో జాతీయస్థాయితో పాటు దేశవిదేశాలలో అనేక ప్రదర్శనలిచ్చా. నేను డ్యాన్స్ చేస్తున్నప్పుడల్లా నాన్నే గుర్తొస్తారు. దీంతో కష్టమనేది అనిపించదు. పెళ్లి తర్వాత కూడా మా అత్తారింటి వారికి నాన్న ఆశయం నెరవేర్చాలని చెప్పా. వారు కూడా ఎంతో సహకరిస్తున్నారు. – మహాలక్ష్మి, శాస్త్రీయనృత్య కళాకారిణి, అనంతపురం

ఇప్పటికీ నాన్నే రోల్ మోడల్



మాది కర్నూలు జిల్లా పాణ్యం. నాన్న శామ్యూల్. అమ్మ పుల్లమ్మ, ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. మేం ముగ్గరం అక్కాచెల్లెళ్లం. అన్న టెలికాంలో డివిజన్ ఇంజినీర్. అందరినీ బాగా చదివించారు. చదువుతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఎప్పుడూ చెప్పేవారు. ఇప్పుడు కూడా మా నాన్న పేరు చెబితేనే మా గుర్తింపు వచ్చేంత స్థాయికి ఎదిగారు. శామ్యూల్ సార్ కూతురు అంటే ఎంతగానో గౌరవిస్తారు. ఇప్పటికీ మా నాన్న రోల్ మోడల్. నేను బాగా చదువుతానని గుర్తించి బాగా ప్రోత్సహించారు. ఎమ్మెస్సీ గోల్డ్‌మెడల్ వచ్చినప్పుడు నాన్న ఎంతో ఆనందించారు.

– ప్రొఫెసర్ శోభాలత, మేథమేటిక్స్ విభాగాధిపతి, ఎస్కేయూ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు నాగరాజు

చెన్నేకొత్తపల్లి: చింతచెట్టుపై నుంచి పడి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ముష్టికోవెల గ్రామానికి చెందిన నాగరాజు(55) గత నెల 28న చింతచిగురు కోసం గ్రామ సమీపంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారి చెట్టు పై నుంచి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గొర్రెల పెంపకందారుడి ఆత్మహత్య



మృతుడు ఓబులేసు

చెన్నేకొత్తపల్లి: అప్పుల బాధ తాళలేక గొర్రెల పెంపకందారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన న్యామద్దెల పంచాయతీ చిన్నంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓబులేసు(35) అనే వ్యక్తి తెలిసిన వారి వద్ద అప్పు చేసి గొర్రెలను కొనుగోలు చేసుకొని పెంచుకునేవాడు. అయితే అనారోగ్యంతో చాలా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈక్రమంలో అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.10 లక్షల వరకు అప్పు అయింది. రుణదాతలు అప్పు చెల్లించాలని ఓబులేసుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంటికి సమీపంలో ఉన్న గడ్డివామి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య శ్రీదేవితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ బడి పిల్లలకే 'అమ్మకు వందనం' ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే 'అమ్మకు వందనం' పథకాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మకు వందనం పథకం ద్వారా పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందించనుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, డిజిటల్ క్లాస్‌రూమ్‌లతో నాణ్యమైన గుణాత్మక విద్య అందుతోందన్నారు. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే 'అమ్మకు వందనం' అమలుపరిచినట్లయితే విద్యార్థుల సంఖ్య పెరిగి పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం చేసిన 117 జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులుయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, షరీఫ్, రహీం, రమణయ్య, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనతోనే ఆర్టీసీకి ఆదరణ

- జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

కదిరి అర్బన్: సమయపాలన పాటిస్తే ఆర్టీసీని ప్రయాణికులు మరింతగా ఆదరిస్తారని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆయన డిపో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు షెడ్యూల్ ప్రకారం బస్టాండ్ నుంచి బయలుదేరాలన్నారు. తిరిగి నిర్దేశిత సమయానికి గమ్యస్థానం చేరాలని చెప్పారు. దీంతో పాటు బస్సులను కండీషన్‌లో ఉండేలా చూడాలన్నారు. ప్రయాణికులను పెంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం కదిరి బెంగళూరు, అనంతపురం తిరుపతి, హైదరాబాద్, విజయవాడ రూట్ల సమయపాలనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ డీఎం హరిమోహన్, హరిత, గ్యారేజీ ఇన్‌చార్జ్ రామకృష్ణ ఉన్నారు.

రాళ్ల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

కూడేరు: ఉదిరిపికొండ తండాలో శనివారం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి మామ తిప్పేనాయక్, మరిది రాజగోపాల్ నాయక్‌పై భూ వివాదంలో టీడీపీ నేతలు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. తిప్పేనాయక్, రాజగోపాల్ నాయక్ శనివారం వారి పొలంలో కంది విత్తనం వేసేందుకు వెళ్లారు. టీడీపీ నేతలు రవినాయక్, జయరాంనాయక్ ఉద్దేశ పూర్వకంగా భూమి తమదంటూ అడ్డొచ్చి రాళ్లతో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో వారు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరారు.

టీడీపీ 'తాగునీటి' రాజకీయం

- నరసనాయనికుంట ఎస్సీ, ఎస్టీ కాలనీలకు నీటి సరఫరా బంద్
- వాటర్‌ప్లాంట్ నుంచి నీళ్లు కొనుగోలు చేయాలంటూ సర్పంచ్ కుమారుడి హుకుం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారమే అండగా టీడీపీ నాయకులు గ్రామాల్లో రెచ్చిపోతున్నారు. చివరికి తాగునీటి విషయంలోనూ రాజకీయాలు చేస్తుండడం పట్ల పలువురు మండిపడుతున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేరు చెప్పుకుంటూ అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు తాగునీరు రాకుండా అడ్డుకుంటున్నారు. కౌంటింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే ఈ చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే...గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుమారుడు శ్రీనివాసులు అనధికారికంగా వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుని నీటి వ్యాపారం చేసుకుంటున్నాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో గోవిందరెడ్డి అనే వ్యక్తి ఒక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీల వాసులందరూ గోవిందరెడ్డి ప్లాంట్ నుంచే నీళ్లు తెచ్చుకునేవారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని అందరూ తమ వద్దే నీళ్లు కొనుగోలు చేయాలంటూ సర్పంచ్ కుమారుడు శ్రీనివాసులు హుకుం జారీ చేశాడు. ఇంతటితో ఆగకుండా ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు గోవిందరెడ్డి వాటర్‌ప్లాంట్‌కు వెళ్లే నీటిపైపులైన్లకు సర్పంచ్ కుమారుడు డమ్మీ కొట్టించాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు పంచాయతీ కార్యాలయం చాలా దూరం ఉంది. అంతదూరం వెళ్లి తాము నీళ్లు తెచ్చుకోలేమని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్‌వెల్ వాహన డ్రైవర్‌కు బెదిరింపులు

చేసేదిలేక గోవిందరెడ్డి తన సొంత భూమిలో 30 ఏళ్ల కింద వేయించుకున్న బోరును తవ్వించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం బోర్‌వెల్ వాహనాన్ని రప్పించి ఆ బోరును శుభ్రం చేయించేందుకు సిద్ధమయ్యాడు. ఆ బోరు రెడీ అయితే ఎస్సీ, ఎస్టీలు తమ వద్దకు రారని భావించిన సర్పంచ్ కుమారుడు, మరికొందరితో కలిసి బోర్‌వెల్ వాహన డ్రైవర్‌ను బెదిరించారు. బోరు శుభ్రం చేస్తే మాత్రం ఎమ్మెల్యే పరిటాల సునీతతో చెప్పించి నీ వాహనాన్ని సీజ్ చేయిస్తామని హెచ్చరించడంతో సదరు వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోనే ఇంత ఘోర పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఇప్పటిదాకా ఆవైపు కన్నెత్తి చూడలేదని పలువురు మహిళలు వాపోతున్నారు.

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం

టీడీపీ గెలవగానే ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సరఫరా అయ్యే నీటి పైపులైన్లకు డమ్మీలు కొట్టారు. దూరంగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో ఉన్న వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు ఎస్సీ, ఎస్టీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు..పట్టణానికి చెందిన ఉమాపతి(64)కి మానసిక స్థితి సరిగాలేదు. ఈనేపథ్యంలో పట్టణంలోని వీధుల్లో తిరిగాడేవాడు. శనివారం ఉదయం టీ సర్కిల్ వద్ద అపస్మారక స్థితి ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తలకు రక్తగాయాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హరినాథ్ తెలిపారు.

ఒకేషనల్ కళాశాల.. సమస్యలు చాలా!

- ఇంత వరకు మంజూరు కాని ప్రిన్సిపాల్ పోస్టు
- నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు కాని వైనం
- ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌తోనే కాలయాపన
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మడకశిరలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలను పలు సమస్యలు వేధిస్తున్నాయి. జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న ఈకళాశాల అభివృద్ధిని అటు ప్రజా ప్రతినిధులు, ఇటు ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించు కోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో 25 ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మడకశిరకు ఒకేషనల్ కళాశాల మంజూరైంది. కళాశాల ప్రారంభమై దాదాపు 16 ఏళ్లవుతున్నా రెగ్యులర్ ప్రిన్సిపాల్ పోస్టు మంజూరు కాలేదు. దీంతోపాటు నాన్ టీచింగ్ పోస్టులు కూడా మంజూరు కాలేదు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ఈకళాశాలకు ఈపరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11 కోర్సుల నిర్వహణ..

ప్రస్తుతం కళాశాలలో వివిధ 11 కోర్సులను నిర్వహిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులు ఈకోర్సులను పూర్తి చేసుకుని ఉపాధి అవకాశాలు పొందారు. ఇలా ఎంతో ప్రాధాన్యత కలిగిన కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ పోస్టు మంజూరు కాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని విద్యావంతులు అంటున్నారు. నాన్ టీచింగ్ పోస్టులు కూడా మంజూరు కాకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టతరంగా మారింది. 16 ఏళ్ల నుంచి ఈకళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాలే దిక్కుగా మారారు. కళాశాలలో పని చేసే అధ్యాపకులే అటు విద్యార్థులకు పాఠాలు చెబుతూ...ఇటు నాన్ టీచింగ్ పోస్టులకు సంబంధించిన పనులను కూడా చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణప్ప ఇటీవల పదవీ విరమణ చేశారు.అయితే ఇంత వరకు ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను కూడా నియమించలేదు. దీంతో విద్యార్థులకు టీసీలందక ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఈకళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు సీడ్ కార్పొరేషన్ అండ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయం చేసే ప్రతి రైతుకూ నేషనల్ సీడ్ కార్పొరేషన్ అండగా ఉంటుందని కార్పొరేషన్ మేనేజర్ కేశవమూర్తి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ రామసుబ్బయ్య, డాక్టర్ జాన్సన్, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వెంకటరమణ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంపై మెలుకువలు, బ్రీడర్ సీడ్‌పై అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో ఎవరైనా రైతులు కూటమిగా ఏర్పడి బ్రీడర్ సీడ్ వేరుశనగ సాగు చేయదలిస్తే సీడ్ కార్పొరేషన్ ద్వారా అవసరమైన మేలురకం విత్తనాన్ని అందజేస్తామన్నారు. దీన్ని రైతుల నుంచి మార్కెట్ కంటే అధిక ధరలు చెల్లించి తిరిగి కొనుగోలు చేస్తామన్నారు. విత్తనం ఖరీఫ్, రబీ సీజన్లలో అందజేస్తామన్నారు. శాస్త్రవేత్తలు పంటను నిత్యం పరిశీలించి సలహాలు అందిస్తారన్నారు. పంటలను రక్షించుకునేందుకు పొలానికి చుట్టూ సరిహద్దు పంటగా జొన్న, సజ్జ వేసుకోవాలని సూచించారు. వేరుశనగకు వచ్చే వ్యాధులు, చీడ పీడలు, ఉపయోగించే మందులపై ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఏరువాకలో వ్యవసాయ పంచాంగం పుస్తకాలు ఉన్నాయని, రైతులు రూ.270 చెల్లించి కొనుగోలు చేయవచ్చన్నారు. డీడీఏ విద్యావతి, ఏఓ వెంకటబ్రహ్మం ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

గుంతకల్లు: పాత గుంతకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పాత గుంతకల్లులోని 6వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు అల్తాఫ్, శ్రీకాంత్ మరో ఇద్దరు కలిసి వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాముతో గొడవకు దిగారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తావా..ఇప్పుడు నీ గతి ఏమీ అంటూ దుర్భాషలాడుతూ రాముపై రీపర్ కట్లతో దాడి చేసి గాయపరిచారు.